



ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 380 తిరుపతి తేది : మంగళవారం 17 మార్చి 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS


## కాబూల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి..

### - 400 మంది మృతి!



కాబుల్ –ఆంధ్రనాడు, మార్చి 16:

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులు పెను విషాదాన్ని మిగిల్చాయి. సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో మాదకద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తి పొందేందుకు చికిత్స అందిస్తున్న 'ఒమిడ్ అడిక్షన్ ట్రీట్‌మెంట్ హాస్పిటల్' లక్ష్యంగా పాక్ యుద్ధ విమానాలు క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ఈ భీకర దాడిలో ఇప్పటివరకు 400 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 250 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 2,000 పడకల సామర్థ్యం కలిగిన ఈ భారీ ఆసుపత్రి భవనం దాడుల ధాటికి కుప్పకూలింది. దాడి జరిగిన సమయంలో వందలాది మంది రోగులు నిద్రలో ఉండటంతో ప్రాణనష్టం భారీగా జరిగింది. మృతుల్లో ఎక్కువ మంది పేద రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నట్లు సమాచారం. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు రెస్క్యూ టీమ్స్ శ్రమిస్తున్నాయని అధికారులు తెలిపారు. పౌర ఆసుపత్రిపై దాడి చేయడం అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని, ఇది మానవత్వానికి వ్యతిరేకమైన నేరమని తాలిబన్ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ మండిపడ్డారు. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే, తాము కేవలం ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని, పౌర ప్రాంతాలపై దాడులు చేయలేదని పాకిస్థాన్ ప్రభుత్వం బుకాయిస్తోంది. ఈ ఘటనతో ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఆసుపత్రి ధ్వంసమై వందలాది మంది అమాయకులు బలికావడంతో అంతర్జాతీయ సమాజం ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా సంస్థలు వెల్లడించాయి.




## తిరుపతిలో జపాన్ టెక్నాలజీతో 'బిగ్ ప్రింట్' సంస్థ ప్రారంభం

- ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమెల్యే గురజాల మోహన్, శాప్ ఛైర్మన్ రవినాయుడు
- ముద్రణా రంగంలో అత్యుత్తమ నాణ్యత అందిస్తామన్న మేనేజింగ్ డైరెక్టర్ హరిబాబు

తిరుపతి –ఆంధ్రనాడు, మార్చి 16:

శ్రీ అక్షర " బిగ్ ప్రింట్ " నందు ముద్రణ రంగంలో తిరుగులేని నాణ్యత ఉందని, ప్రపంచం రంగుల మయం అవుతున్న సమయంలో జపాన్ నుండి దిగుమతి చేసుకున్న ముద్రణ సామాగ్రితో ముద్రణ రంగంలో తిరుగు లేని నాణ్యత బిగ్ ప్రింట్ వారి స్వంతమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అభిప్రాయపడ్డారు. తిరుపతి అన్నమయ్య కూడలిలో ఏపీ జె ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో స్థాపించిన శ్రీ అక్షర ప్రింటర్స్ వారి " బిగ్ ప్రింట్" నూతన యంత్రాలను ఆయన ప్రారంభించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తో పాటు శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, తుడా అధ్యక్షులు డాలర్ దివాకర్ రెడ్డి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కర్ణాటక బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వెంకట శ్రీనివాస్, ఎడిఫై విద్యాసంస్థల చైర్మన్ ప్రణీత్, జి ఎస్ ఆర్ మాగ్నెట్ స్కూల్ కస్పాండెంట్ జి సత్య నారాయణ, టి టి ఈ ఏజీఎం అమరేంద్ర బాబు



తదితర ప్రముఖులు అతిథులుగా విచ్చేసి పూజలో పాల్గొని ఆధునిక టెక్నాలజీ తో కూడిన ముద్రణా యంత్రాలను ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రాలను ఆధునిక ముద్రణ యంత్రాలలో ముద్రించి ఆహ్వానితుల ఫోటోలను మద్దినేని హరిబాబు వారికి బహుమతిగా అందించారు. తమ చిత్రాలను అందు కున్న ప్రముఖులు ముద్రణలోని అత్యుత్తమ నాణ్యతను ప్రశంసించారు. ప్రింటింగ్ లో జీవము ఉట్టిపడే విధంగా ఉండటం

- మిగతా 2లో..



## అమరావతిలో హజ్ హౌస్

- వక్ఫ్ ఆస్తులను కాపాడతాం
- ఇఫ్తార్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి –ఆంధ్రనాడు, మార్చి 16:

రాజధాని అమరావతిలో నూతనంగా హజ్ హౌస్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిములకు 21 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు అందించినట్లు పేర్కొన్నారు. విజయవాడలోని ఎ–ప్లస్ కన్వెన్షన్‌లో ప్రభుత్వం తరపున సోమవారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనలు నిర్వ హించారు. ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్‌ను పూర్తి చేసి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తున్నామని, అన్ని జిల్లాల్లోనూ, నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన సూక్తి అని పేర్కొన్నారు. ముస్లిములను ఆర్థికంగా,

- మిగతా 2లో..

## రాష్ట్రాభివృద్ధే అమరజీవికి నివాళి

- అమరావతిలో 58 అడుగుల విగ్రహావిష్కరణలో సీఎం చంద్రబాబు
- ఇంటింటికి నీరిచ్చే పథకానికి పొట్టి శ్రీరాములు పేరు
- వైశ్యులను ఆర్యవైశ్యులుగా పిలిచేలా జీఓ




అమరావతి –ఆంధ్రనాడు, మార్చి 16:

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడమే అమరజీవి పొట్టి శ్రీరాములుకు అర్పించే నివాళి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని అమరావతిలోని శాఖమూరులో ఏర్పాటు చేసిన 58 అడుగుల పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహం(స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్)ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో మొదటిదశ విగ్రహావిష్కరణ కాగా, రెండవ దశలో మ్యూజియం, మూడవ దశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను చేపట్టనున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని, రాష్ట్రాభివృద్ధికోసం కృషి చేయాలని అన్నారు.

- మిగతా 2లో..

## ఇరాన్‌పై బాంబు దాడులు ఉధృతం !

- ప్రధాన పారిశ్రామిక, రవాణా కారిడార్‌పై దాడులు
- దుబాయి ఎయిర్‌పోర్టుకు సమీపంలో పేలుళ్లు

2లో

## కేంద్రం తీరువల్లే 'గ్యాస్ కష్టాలు

- ప్రతిపక్షాల ఆందోళన
- ప్రభుత్వానిదే బాధ్యత : మల్లికార్జున్ ఖర్గే
- ప్రజల వద్దకు వెళ్తే సంక్షోభం లోతు అర్థమవుతుంది : జాన్ బ్రిట్టాస్

2లో

## తిరుపతిలో జపాన్ టెక్నాలజీతో 'బిగ్ ప్రింట్' సంస్థ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఎంతో గొప్ప విషయం అన్నారు. ఇప్పటివరకు తిరుపతిలో లేని విధంగా ఐఎస్ఓ సర్టిఫికేషన్ తో బిగ్ ప్రింట్ అందుబాటులోకి రావటం సంతోషకరమన్నారు. ఉత్తమ నాణ్యతా ప్రమాణాలతో బిగ్ ప్రింట్ తిరుపతి ప్రజల అవసరాలకు తగిన విధంగా అన్ని రకాల ప్రింటింగ్ పనులు సకాలంలో చేసి ఇవ్వగలరని ప్రముఖులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికత తో కూడిన ముద్రణ యంత్రాలతో మల్టీకలర్ ప్రింటింగ్ కోరిన విధంగా అందించేందుకు బిగ్ ప్రింట్ అన్నివేళల అందుబాటులో ఉంటుందని బిగ్ ప్రింట్ మేనేజర్ కొత్త ముని శేఖర్ తెలియచేసారు. కావలసిన ముద్రణ పనులను అతి తక్కువ కాలంలో పూర్తిచేసి ఇవ్వగల సామర్థ్యం అక్షర వారి బిగ్ ప్రింట్ వారి ప్రత్యేకత అని ఆయన తెలియజేశారు.ఇలాంటి ఆధునిక సాంకేతిక ముద్రణ యంత్రాలు ఇప్పటివరకు తిరుపతిలో లేవని తెలిపారు. ఈ లోటును తిరుపతి ప్రజలకు మద్దినేని హరిబాబు శ్రీ అక్షర ప్రింటర్స్ వారి " బిగ్ ప్రింట్" తో తీర్చగలిగారని అన్నారు. ఉమ్మడి చిత్తూరు,కడప, నెల్లూరు,అనంతపురం తదితర జిల్లాల ప్రజలకు అవసరమయ్యే ముద్రణా పనులను ఉత్తమ నాణ్యతతో చేసి ఇవ్వగలిగే సామర్థ్యం బిగ్ ప్రింట్ కు ఉన్నట్లు ప్రముఖులు పేర్కొన్నారు.శ్రీ అక్షర ప్రింటర్స్ వారి బిగ్ ప్రింట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులను అందరిని శేష వస్త్రం తో సత్కరించి, జ్ఞాపికలను బహుకరించారు.

## కేంద్రం తీరువల్లే 'గ్యాస్ కష్టాలు

- ప్రతిపక్షాల ఆందోళన
- ప్రభుత్వానిదే బాధ్యత : మల్లికార్జున్ ఖర్గే
- ప్రజల వద్దకు వెళ్తే సంక్షోభం లోతు అర్థమవుతుంది :జాన్ బ్రిట్టాస్



**న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, మార్చి 16:**

దేశంలో నెలకొన్న వంట గ్యాస్ సంక్షోభంపై ప్రతిపక్షాలు పార్లమెంటులో ఆందోళన చేపట్టాయి. సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. సోమవారం వంట గ్యాస్ సంక్షోభంపై రాజ్యసభ దద్దరిల్లింది. జీరో అవర్‌లో రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. వంట గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం చెబుతున్న మాటలు తప్పని వాస్తవ పరిస్థితులు నిరూపిస్తున్నాయని చెప్పారు. గల్ఫ్ యుద్ధం, హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గ్యాస్ సమస్య మధ్య తరగతి, రెస్టారెంట్లు, హాస్టళ్లు, వాణిజ్య వినియోగదారులను ప్రభావితం చేస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌పిజి లభ్యత, ధర స్థిరత్వం తీవ్రమైన సమస్యలుగా మారాయనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంతో తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించలేదని, దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ల తీవ్ర కొరతకు ప్రభుత్వమే కారణమని విమర్శించారు. రెస్టారెంట్లు, హాస్టళ్లు, కమ్యూనిటీ కిచెన్‌లను మూసివేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైపు వంట గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఎల్‌పిజి సరఫరాపై కేంద్రం ముందస్తు ప్రణాళిక వేసుకుని ఉంటే, ఈ పరిస్థితి తలెత్తేది కాదని పేర్కొన్నారు. ఖర్గే ఎరువుల సరఫరా కొరతను కూడా ఎత్తిచూపారు. సిలిండర్ కోసం వెయిటింగ్ సమయాన్ని కూడా 21 నుంచి 25 రోజులకు పెంచారని, ఇది బ్లాక్ మార్కెటింగ్‌కు దారి తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రి హరిదీప్ సింగ్ పూరి దేశంలో ఎల్‌పిజి సరఫరాపై తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సభా నాయకుడు జెపి నడ్డా స్పందించారు. జీరో అవర్‌లో సభ్యులు ప్రజా సమస్యలు లేవనెత్తాల్సిన అవసరం ఉందని, ఛైర్మన్ జోక్యం చేసుకోవాలని నడ్డా కోరారు. సభలో తీవ్రమైన అంశాలపై చర్చలు జరుగుతున్నప్పుడు వాటిపై శ్రద్ధ పెట్టకుండా ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, వంట గ్యాస్ సంక్షోభం విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడిని కొనసాగించారు. ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగుతుండగానే, ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రసంగాన్ని ముగించాలని ఖర్గేను కోరారు. జెపి నడ్డా ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని అన్నారు. ఈ సంక్షోభం దేశం వల్ల కాదని, ప్రపంచ వ్యాప్తంగా కారణాల వల్లే తలెత్తిందని పేర్కొన్నారు.

**ప్రజల వద్దకు వెళ్తే సంక్షోభం లోతు అర్థమవుతుంది : జాన్ బ్రిట్టాస్**

ఎల్‌పిజి సంక్షోభం లేదని చెప్పుకుంటున్న పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, సహాయ మంత్రి సురేష్ గోపిపై సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ప్రత్యేక విమానం అద్దెకు తీసుకుని దేశవ్యాప్తంగా ప్రయాణిస్తే, సంక్షోభం లోతు అర్థమవుతుందని అన్నారు. 'చాలా రాష్ట్రాల్లోని చాలా రెస్టారెంట్లు మూసివేయబడ్డాయి. కేరళంలో కళాశాలలు, ఆస్పత్రులు కూడా మూసివేశారు. క్యాంటీన్లు లేకుండా ముందుకు సాగడం అసాధ్యమైన పరిస్థితిలో మూసివేత అనివార్యమైంది.

సురేష్ గోపి సినిమా డైలాగ్‌లు పునరావృతం చేయడం వల్ల ఈ సంక్షోభం పరిష్కారం కాదు. దేశంలో కోవిడ్ కాలం నాటి సంక్షోభం తలెత్తింది. రెండు ఎల్‌పిజి ఓడలు రావడాన్ని ప్రభుత్వ వర్గాలు పెద్ద విషయంగా చిత్రీకరిస్తున్నాయి. రెండు రోజుల వినియోగానికి మూడు ఎల్‌పిజి ఓడలు అవసరమని గణాంకాలు చెబుతున్నాయి. తగినంత ఎల్‌పిజి నిల్వలు లేకపోవడంతో బ్లాక్ మార్కెటింగ్ ఎక్కువగా ఉంది. ఎల్‌పిజి సంక్షోభం ఇతర రంగాల్లో కూడా తీవ్రమైన పరిణామాలను కలిగిస్తుంది' అని జాన్ బ్రిట్టాస్ హెచ్చరించారు.

# రాష్ట్రాభివృద్ధే అమరజీవికి నివాళి


(మొదటిపేజీ తరువాయి)

పొట్టి శ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తికాదని చెప్పారు. రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు చిహ్నంగా 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్ అని పేరు పెట్టినట్టు తెలిపారు. తెలుగువారికి గుర్తింపు లేని రోజుల్లోనే ఆయన ప్రాణత్యాగంతో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. రాజధానిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం తెలుగువారందరికీ గర్వకారణమని చెప్పారు. ఇంటింటికీ నీళ్లిచ్చే పథకానికి డిప్యూటీ సిఎం అమరజీవి జలధార పేరు పెట్టారని అన్నారు. 2019-24 మధ్యకాలంలో గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అసలు రాజధానే లేని విధంగా చేశారని అన్నారు. గత పాలకులు శ్మశానం అని, ఎడారి అని, అమరావతిలో రాజధాని ఉండకూడదని ప్రచారం చేసి రైతుల త్యాగాన్ని ఎవరూ గుర్తించకుండా చేశారని పేర్కొన్నారు. వారి త్యాగంతోనే రాజధాని ఏర్పాటైందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగంగా సాగుతోందని, పుష్కరాలకంటే ముందే దాన్ని జాతికి అంకితం చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా అమరావతిని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. గతంలో వ్యాపారాలు చేసుకునేందుకు వైశ్యులు భయపడాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇప్పుడు స్వేచ్ఛగా చేసుకుంటున్నారని తెలిపారు. సంపాదించిన సొత్తులో కొంత దానధర్మాలకు ఖర్చుచేసే ఏకైకవర్గం ఆర్యవైశ్యులని పేర్కొన్నారు. వైశ్యులను వేర్వేరు పేర్లతో కాకుండా అందరినీ ఆర్యవైశ్యులుగా పరిగణించేలా జిఓ తీసుకువస్తామని అన్నారు. అందరం ఐక్యంగా పనిచేయడమే ఆయనకు అర్పించే నివాళని పేర్కొన్నారు వికసిత్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్‌గా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఎవరిప్రాణత్యాగంమీద రాష్ట్రం ఏర్పడిందో ఆ మహనీయుడిని స్మరించుకోవడం అందరి కర్తవ్యం అన్నారు. పొట్టి శ్రీరాములు చరిత్రను భవిష్యత్‌తరాలు స్మరించుకునేలా సిఎం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆయన పేరు పెడుతున్న జలధార పథకాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నీయులు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని దేశం గుర్తుపెట్టుకుంటుందని వివరించారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఒక మంచి త్యాగం, ఒక జాతి గౌరవం ఒక దీక్ష ఒక రాష్ట్రం ఇవ్వన్నీ కలిపితే ఆంధ్రప్రదేశ్ అవుతుందన్నారు. 58 అడుగుల విగ్రహంతో ఆయన రాష్ట్రంలో జీవించి ఉన్నారని, తెలుగుజాతి ఆత్మగౌరవానికి గుర్తుగా దీన్ని నిర్మించామని పేర్కొన్నారు. మాజీ సిఎం రోశయ్య రాజకీయాల్లో స్టేట్స్‌మెన్ అని, రాజకీయాలకు అతీతంగా పనిచేశారని చెప్పారు.

ఆయన్ను చూసి రాజకీయాల్లో పెరిగానని వివరించారు. పొట్టి శ్రీరాములు గుర్తుగా కాయిన్ విడుదలపై కేంద్రంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలశాఖ మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడుతున్నామంటే అది శ్రీరాములు త్యాగఫలితమేనని పేర్కొన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ అమరావతి స్వర్ణాంధ్రగా మారాలంటే పొట్టి శ్రీరాములు లాంటి వారి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ఉండాలని తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో పొట్టి శ్రీరాములు సత్యాగ్రహం చేసి రాష్ట్రం కోసం పనిచేశారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అమరజీవి పొట్టి శ్రీరాములు ట్రస్ట్ ఛైర్మన్ దూండీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై బాంబు దాడులు ఉధృతం !

- ప్రధాన పారిశ్రామిక, రవాణా కారిడార్‌పై దాడులు
- దుబాయి ఎయిర్‌పోర్టుకు సమీపంలో పేలుళ్లు



**టెహరాన్-ఆంధ్రనాడు, మార్చి 16:**

దాడులు, ప్రతి దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడికిపోతోంది. యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించినా ఇజ్రాయిల్-అమెరికా సేనలు ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. పైగా, తాజాగా సోమవారం ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా, ఇజ్రాయిల్ దళాలు బాంబుల వర్షం కురిపించాయి. టెహరాన్, హమద్, ఇస్ఫహాన్, షిరాజ్, తబ్రిజ్ సహా పలు నగరాలు, పట్టణాలపై దాడులు కొనసాగుతున్నాయి. సెంట్రల్ టెహరాన్‌లో బాంబు పేలుళ్ళ శబ్దాలు వినిపించాయి. ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలం చేశారు. ఇరాన్‌లో వరుసగా 17వ రోజు కూడా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. కాగా హిజ్బుల్లా దళాలను లక్ష్యంగా చేసుకొని దక్షిణ లెబనాన్‌లోని జబల్ అల్-బటమ్‌పై వైమానిక దాడులు జరిగాయి. హిజ్బుల్లాపై భూతల దాడులు కూడా ప్రారంభమయ్యాయి. రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఆదివారం రాత్రి కూడా విమాన దాడులు కొనసాగాయి. లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులలో ఇప్పటి వరకూ వంద మంది చిన్నారులు సహా 850 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని డ్రోన్ తయారీ కర్మాగారాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నామని, ఇరాన్ క్షిపణి, డ్రోన్ల తయారీ సామర్థ్యాన్ని దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఇరాన్ సుప్రీం నేత అలీ ఖమేనీ ఉపయోగించిన విమానాన్ని కూడా ధ్వంసం చేశామని ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది.

**ఛాబహార్ స్వేచ్ఛా వాణిజ్య మండలి సమీపంలో భారీ పేలుళ్ళు**

ఇరాన్‌లో ప్రధాన పారిశ్రామిక, రవాణా కేంద్రంగా కొనసాగుతున్న ఛాబహార్ స్వేచ్ఛా వాణిజ్య మండలి సమీపంలోని సైనిక కేంద్రాలపై అమెరికా దళాలు వైమానిక దాడులు చేశాయి. దీంతో ఆ ప్రాంతమంతటా భారీగా పేలుళ్ళ శబ్దాలు వినిపించాయి. ఈ స్వేచ్ఛా వాణిజ్య మండలి పాకిస్తాన్ సరిహద్దు సమీపంలోని బలూచిస్థాన్ రాష్ట్రంలో ఇరాన్‌కు చెందిన ఆగేయ సిస్టన్‌లో ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకు సంప్రదాయ వాణిజ్య మండళ్ళకు ప్రత్యామ్నాయంగా 1992లో దీనిని ఏర్పాటు చేశారు. హిందూ మహా సముద్రంలో ప్రవేశించేందుకు ఇరాన్‌కు ఉన్న ఏకైక సముద్ర ఓడరేవు ఛాబహారే. ఉజ్బెకిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్ వంటి పలు మధ్య ఆసియా దేశాలకు ఈ వాణిజ్య మండలి రవాణా కారిడార్‌గా ఉపయోగపడుతోంది. ఛాబహార్ సమీపంలో అమెరికా దళాలు దాడులు చేయడం ఇది మొదటిసారి కాదు. యుద్ధం మొదటి రోజునే ఈ రాష్ట్రంలోని సైనిక కేంద్రాలపై దాడి జరిగింది.

**దుబాయి ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇరాన్ డ్రోన్ దాడి**

దుబారు విమానాశ్రయం సమీపంలో సోమవారం మంటలు చెలరేగాయి. విమానాశ్రయం సమీపంలో ఉన్న ఇంధన ట్యాంకుపై ఇరాన్ డ్రోన్ పడడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో అత్యవసర బృందాలు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టాయి. ముందు జాగ్రత్త చర్యగా విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. కొన్ని విమానాలను దుబాయి ఎయిర్‌పోర్టు నుంచి అల్ మక్టమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దారి మళ్లించారు. దుబాయి పౌర రక్షణ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. డ్రోన్ దాడి నేపథ్యంలో విమానాశ్రయ రోడ్డును, ఎయిర్‌పోర్ట్ టన్నెల్‌ను పోలీసులు మూసివేశారు. విమానాశ్రయం పరిసరాలపై డ్రోన్ దాడి జరగడం ఇది మొదటిసారి కాదని అధికారులు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి నుండి మొత్తంగా ఆరు బాలిస్టిక్ క్షిపణులు, 21 డ్రోన్లను ఎదుర్కొన్నామని యుఎఇ తెలిపింది.

**యూఎఇ చమురు వాణిజ్య హబ్‌పై**

దుబాయి విమానాశ్రయం ప్రాంతంలో దాడి జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఇ )లోని ఫుజైరా చమురు వాణిజ్య హబ్‌పై కూడా డ్రోన్ దాడి జరిగింది. దీంతో అక్కడ పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు సహాయ సిబ్బంది రంగంలోకి దిగారు. వెంటనే అక్కడ చమురు లోడింగ్ కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రపంచంలో ముడి చమురును, ఇంధనాలను నిల్వ చేసే అతి పెద్ద కేంద్రాలలో ఫుజైరా చమురు కేంద్రం ఒకటి. ఇది యూఎఇ కి చెందిన అబూదాబీ ముడి చమురు పైప్‌లైన్‌కు చివరన ఉంది. హార్మూజ్ జలసంధి ద్వారా కాకుండా ఇక్కడి నుంచి యుఎఇ ముడి చమురు సరఫరా అవుతుంటుంది. ఈ పైప్‌లైన్ ద్వారా రోజుకు ఒకటిన్నర మిలియన్ బ్యారెళ్ళ చమురును పంపవచ్చు. ఫుజైరా టెర్మినల్‌పై శనివారం కూడా దాడి జరిగింది.

**భారత ట్యాంకర్‌ను నింపుతుండగా**

ఫుజైరా టెర్మినల్‌పై శనివారం దాడి జరిగిన సమయంలో భారత పతాకంతో ఉన్న ఒక ముడి చమురు ట్యాంకర్ 'జగ్ లడ్కీ'లో చమురును నింపుతున్నారు. ఈ నౌకలో యుఎఇ ఉత్పత్తి చేసిన 80,800 టన్నుల ముడి చమురు ఉంది. అయితే ఈ దాడిలో ట్యాంకర్‌కు కానీ, అందులోని సిబ్బందికి కానీ ఎలాంటి నష్టం జరగలేదని, ఆ నౌక స్వదేశానికి చేరుకుంటోందని అధికారులు తెలిపారు.

**గుజరాత్ చేరుకున్న భారత్ ట్యాంకర్**

40వేల మెట్రిక్ టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌ను తీసుకుని భారత ఎల్‌పిజి ట్యాంకర్ 'శివాలిక్' సోమవారం సాయంత్రం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. ఈ నౌక గత అర్ధరాత్రి హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది.

**ఇరాన్‌పై దాడికి ప్రళయ కాల విమానం...**

అమెరికా యుద్ధ నేవికి చెందిన బోయింగ్ 'ఇ-6బి మెర్క్యురి' విమానం, 'ప్రళయ కాల విమానం' గా పిలిచే ఈ విమానం ప్రపంచవ్యాప్తంగా వ్యూహాత్మక కమాండ్ , కమ్యూనికేషన్స్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. అణు యుద్ధం లేదా ఇతర తీవ్రమైన సంక్షోభాల సమయంలో అమెరికా అధ్యక్షుడు , రక్షణ కార్యదర్శి అణు బలగాలతో నిరంతరం సంభాషించ డానికి ఈ విమానం ఒక మొబైల్ కమాండ్ పోస్ట్‌గా పనిచేస్తుంది. ఇ-6బి మెర్క్యురి విమానం రెండు ప్రధాన మిషన్లను నిర్వర్తిస్తుంది.

కమ్యూనికేషన్స్ రిలే, వ్యూహాత్మక ఎయిర్‌బోర్న్ కమాండ్ పోస్ట్ భూమిపై ఉన్న కమాండ్ సెంటర్‌లు పనిచేయని పరిస్థితుల్లో, ఈ విమానం గాల్లో నుండి జలాంతర్గాములు, బాంబర్లు, ఖండాంతర క్షిపణులకు ఆదేశాలను పంపగలదు. ఇందులో అమర్చిన ఎయిర్‌బోర్న్ లాంచ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా మినిట్‌మ్యాన్ ఖండాంతర క్షిపణులను రిమోట్‌గా ప్రయోగించే సామర్థ్యం దీనికి ఉంది. దీని రెక్కల విస్తీర్ణమే 145 అడుగులు, 9 అంగుళాలు. ఈ విమానం గంటకు సుమారు 960 కిలోమీటర్ల (600 మైళ్ళు) వేగంతో ప్రయాణించగలదు, 40 వేల అడుగుల ఎత్తుకు పైగా ఎగరగలదు. ఇంధనం నింపకుండా 15 గంటలు, నింపుకుంటూ 72 గంటల వరకు నిరంతరం ప్రయాణించగల సామర్థ్యం దీని సొంతం. ఇది అత్యంత క్లిష్ట పరిస్థితులలో కూడా కమ్యూని కేషన్లను కొనసాగిస్తుంది. దీన్ని ఇరాన్‌పై దాడికి ఉపయోగించడానికి అమెరికా సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# అమరావతిలో హజ్ హౌస్

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు ముస్లిములలో 4.38 లక్షల మందికి ఇస్తూ ఏడాదికి రూ.3,511 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఇమామ్‌లకు రూ.5 వేలు, మౌజన్లకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనంగా రూ.180 కోట్లు, మరో రూ.45 కోట్ల బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తున్నామని, వివాహ లైసెన్స్ గడువు మూడేళ్ల నుంచి పదేళ్లకు పెంచామన్నారు. 347 మంది ముస్లిములు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 1,500 వక్ఫ్ ఆస్తులను సర్వే పూర్తి చేశామని, వక్ఫ్ ఆస్తులను కాపాడే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూర్ బాషా ఫెడరేషన్ పేరును దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషనుగా మార్పు చేసి రూ.100 కోట్లు కేటాయించామన్నారు. గత బడ్జెట్లో మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం రూ.6,090 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉర్దూ అకాడమీకి గత పాలకులు రూ.1 లక్ష మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసిందన్నారు. అబ్దుల్ హక్ అవార్డుకు రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని, ఉర్దూ ఘర్, షాధీ ఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు నజీర్, బోండా ఉమా, గద్దె రామ్మోహన్, పలువురు ప్రజా ప్రతినిధులు, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

# 'బిగ్ ప్రింట్' సంస్థ ప్రారంభోత్సవ చిత్రమాలిక




















## తాతా,మనవడు మనవరాళ్ల...
# ఘోర విషాద మృతి ఘటన

- బాధితులను పరామర్శించిన టిడిపి పట్టణ అభివృద్ధి ఫైమన్ కమిటీ
- వారి కుటుంబానికి తక్షణ సాయంగా 30 వేల రూపాయలు నగదు అందజేసిన సివిరెడ్డి, రామకృష్ణంరాజు, శ్రీకాంత్
- నేడు బాధిత కుటుంబాన్ని పరామర్శించనున్న పుంగునూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి చల్లా రామచంద్రారెడ్డి





**పుంగనూరు –ఆంధ్రవాడు,మార్చి 16:** పుంగనూరు పట్టణం త్యాగరాజ వీధిలో ఆదివారం జరిగిన ఘోర విషాద తాతా మనవడు మనవరాళ్ల ద్విచక్ర వాహనం ద్వారా కార్బన్ మోనాక్సైడ్ ఇల్లంతా చుట్టుముట్టి బయటకు వెళ్లలేక నిద్రిస్తున్న తాతా మనవడు మనవ రాళ్ళ ఘోర దుర్ఘటన అందరికీ తెలిసిన విషయమే, సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి తక్షణ సాయంగా 30వేల రూపాయలను పుంగనూరు పట్టణ అభివృద్ధి కమిటీ నాయకులు సివిరెడ్డి, రామకృష్ణంరాజు , శ్రీకాంతులు మురళి రేవతి దంపతులకు అందజేశారు, ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి కమిటీ ముఖ్య నాయకుడు సివిరెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో ఎప్పుడూ జరిగనటువంటి ఘోర విషాద సంఘటన చూస్తుంటే మా కడుపు తరుక్కుపోతుందని చాలా బాధాకరమని బంగారు భవిష్యత్తు గల ముగ్గురు పిల్లలు ఈ ఘటనలో చనిపోవడం ప్రతి ఒక్కరి మనసు కలచివేసింది వారికి ఎంత ఇచ్చిన ఏమిచ్చినా ఏం చేసినా తక్కువేనని వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కోరుకుంటున్నామన్నారు, అదేవిధంగా వారి కుటుంబాన్ని పెద్దగా ఆదుకోలేక పోయిన మా వంతు తక్షణ సాయంగా రూ .30 వేల నగదును వారి కుటుంబానికి ఇవ్వడం జరిగిందన్నారు , అదే విధంగా మా నాయకుడు పుంగ˘నూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి కూడా వారి కుటుంబాన్ని సందర్శించి ప్రభుత్వం ద్వారా వాళ్లకు అందించే ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాయనిధి ద్వారా వారికి ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతారని ప్రస్తుతం చల్లా రామచంద్రారెడ్డి బయట ఉన్నారని మంగళవారం కానీ లేదా బుధవారం కానీ పుంగనూరు కు రావడం జరుగుతుందన్నారు,ఈ కార్యక్రమంలో పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సమీపతి యాదవ్, ముస్లిం మైనార్టీ నాయకులు ఇబ్రహీం భాష, సయ్యద్ సోహెల్ బాషా , క్లస్టర్ ఇంచార్జి నాగరాజా , క్రిస్టియన్ సెల్ నాయకుడు గిరి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఒంటిమిట్టలో
# నిరంతరాయంగా అన్నప్రసాదాల వితరణ

- టిటిడి చైర్మెన్, బీఆర్ నాయుడు



**తిరుపతి ప్రెస్ క్లబ్ –ఆంధ్రనాడు, మార్చి 16:** ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు పంపిణి చేస్తామని టిటిడి చైర్మెన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఒంటిమిట్టలోని పరిపాలనా భవనంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఒంటిమిట్టలో శ్రీకోదండ రామస్వామిబ్రహ్మోత్సవాలు ఈనెల 27వ తేదీ నుండి ఏప్రిల్ 5 తేదీ వరకు 9 రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర విభజన అనంతరం శ్రీరామనవమి ఉత్సవాలు ఒంటిమిట్టలో రాష్ట్ర పండుగ నిర్వహిస్తున్నాం. టిటిడి ఆధ్వర్యంలో 2016 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు శ్రీ రాముల వారి కళ్యాణం నిర్వహిస్తున్నాం.14వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం ప్రారంభమై 17వ శతాబ్దంలో ముగిసిందని శాసనాలు చెబుతున్నాయి.క్రీ.శ 1356లో బుక్కరాయలు ఈ ఆలయాన్ని నిర్మాణం ప్రారంభించారు. విజయనగర రాజులు అంతరాలయము ,రంగ మండపం ,మహా ప్రాంగణం గోపురం నిర్మించారు.ఏప్రిల్ 1 తేదీ సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు .రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసేభక్తులకు ఉచితంగా రూ. 50 విలువగల శ్రీవారి లడ్డు ప్రసాదా న్ని అందిస్తాం.భక్తులకు అన్న ప్రసాదాలు త్రాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణి చేస్తాం.జిల్లా అధికారులు, టిటిడి సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేస్తున్నాం. శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ప్రపంచవ్యాప్తంగా వీక్షించడానికి ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందిస్తాం.

రూ. 4 కోట్ల రూపాయలతో విద్యుత్ దీపాలంకరణ ఎల్ఈడి , పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు.రూ. 20. 17 కోట్లతో 108 అడుగుల జాంబవంతుడు విగ్రహం నిర్మించేలా చర్యలు చేపడుతున్నాం. మాస్టర్ ప్లాన్ లో భాగంలో 37 కోట్లతో 100 గదులు నిర్మిస్తున్నాంముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈరోజు నుంచి ఒంటిమిట్టలో భక్తులకు మూడు పూటలా అన్నప్రసాదాలు అందిస్తున్నాం.

**అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ప్రారంభించిన టిటిడి చైర్మెన్**

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని టిటిడి చైర్మెన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. గత ఏడాది శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఒంటిమిట్టకు విచ్చేసే భక్తులకు అన్న ప్రసాదాలను నిరంతరంగా అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూచనల మేరకు అన్నప్రసాద కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. భక్తులకు అన్నప్రసాదాలను అందించేందుకు జర్మన్ షెడ్ ను ఏర్పాటు చేశారు. అందులో భక్తులు కూర్చుని అన్నప్రసాదాలు స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు.



**కల్యాణ వేదికను పరిశీలించిన టిటిడి చైర్మెన్**

ఏఫ్రిల్ 1న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను టిటిడి చైర్మెన్ పరిశీలించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా, అన్నప్రసాదాల పంపిణీ, కల్యాణాన్ని భక్తులు ఆనందంగా వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.చెరుకూరి శ్రీధర్, అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్, జేఈవో వి వీరబ్రహ్మం, సివీఎస్వో కే వి మురలీకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## హెచ్.పి.వి టీకాలు బాలిక భవిష్యత్తుకు భరోసా

### -డా ఉషశ్రీ జిల్లా వ్యాధినిరోధక టీకాల నిర్వహణ అధికారి



**పీలేరు–ఆంధ్రనాడు,మార్చి 16:** నేటి బాలిక మేలైన ఆరోగ్యముతో సమాజ శ్రేయస్సు దాగి వుందని, కావున అర్హులైన బాలికలు హెచ్.పి.వి టీకాలు వేసుకుని,ప్రమాదకర గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ రహిత సమాజం నిర్మిద్దామని జిల్లా వ్యాధినిరోధక టీకాల నిర్వహణ అధికారులు డా ఉషశ్రీ బాలికలకు పిలుపునిచ్చారు. సోమవారం డా ఉషశ్రీ పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న హెచ్.పి.వి టీకా లు వేయుకార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డ్స్ రిపోర్ట్స్ పరిశీలించి సూచన సలహాలు ఇచ్చారు. యు – విన్ పోర్టల్‌లో నిర్వహించిన హెచ్.పి.వి టీకాలు నమోదు చేసేటప్పుడు, బాలిక పుట్టిన తేదీ 01-03-2011 నుండి 12-03-2012 మధ్య ఉండాలని. లబ్ధిదారులకు ఏ బి హెచ్ ఎ సృష్టించడం తప్పనిసరి చేసి సూచించిన మార్గదర్శకాలను జాగ్రత్తగా పాటించాలని ఉషశ్రీ టీకాల నిర్వహణ బృందానికి సూచించారు. కార్యక్రమంలో పి.హెచ్.సి తలుపుల ప్రదానవైద్యాధి కారులు డా శ్రీగిరీష, పి.హెచ్. యన్ కుసుమ, ఏ.యన్.యం ప్రమీల,సిహెచ్ఓ అయేషా ఆశా కార్యకర్తలు,బాలికలు వారి పేరెంట్స్ పాల్గొన్నారు.

## భవిత కేంద్రాలకు ఐదు గురు ఫిజియోథెరపిస్టుల నియామకం



**మదనపల్లి –ఆంధ్రనాడు, మార్చి 16:** జిల్లా సమగ్ర శిక్ష పరిధిలోని 15 మండలాల భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 5 ఫిజియోథెరపిస్టుల పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసినట్లు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ నున్నా అనూరాధ తెలిపారు. సోమవారం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల శారీరక చలనం, సమతుల్యత, కండరాల బలం పెంపులో ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. స్ట్రెచింగ్ వ్యాయామాలు, మసిల్ స్ట్రెంగ్తెనింగ్, బ్యాలెన్స్ ట్రైనింగ్ వంటి పద్ధతుల ద్వారా పిల్లల శారీరక స్థితి మెరుగుపడటంతో పాటు శరీర సమన్వయం, కదలికలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఫిజియోథెరపీ పద్ధతులపై ప్రాయోగిక అవగాహన పిల్లల ఆరోగ్యాభివృద్ధికి ఎంతో అవసరమని చెప్పారు.ఈ పోస్టులకు మొత్తం 32 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ప్రతిభ ఆధారంగా ఐదుగురిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన వారు సమగ్ర శిక్ష ప్రతిష్టను కాపాడే విధంగా బాధ్యతాయుతంగా పనిచేస్తూ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ జనార్దన్, సీఎంవో కరుణాకర్ పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ప్రతిభకు పవన్ తేజకు డాక్టరేట్

**మదనపల్లి –ఆంధ్రనాడు, మార్చి 16:**సామాజిక సేవా రంగంలో చేసిన విశేష కృషికి అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లికి చెందిన శ్రీకృష్ణదేవరాయల బలిజ కాపు సేవాలయ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు తోట పవన్ తేజకు భారత్ విర్చువల్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ డాక్టరేట్ ప్రదానం చేసింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్ అందుకున్నారు.ఈ సందర్భంగా సోమవారం పవన్ తేజ మాట్లాడుతూ నిస్వార్థ సేవా దృక్పథంతో తన తండ్రి సహకారంతో సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ ద్వారా నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్థిక సాయం అందించడం, పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం, నిరాదరణకు గురైన వృద్ధులు, మహిళలకు సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.చిన్ననాటి నుంచే సేవా కార్యక్రమాలపై ఆసక్తి ఉండటం వల్లే తాను సామాజిక సేవా రంగంలో ముందుకు సాగుతున్నానని చెప్పారు. ప్రముఖ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకోవడం గర్వంగా ఉందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. డాక్టరేట్ అందుకున్న పవన్ తేజకు పట్టణంలోని ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.



### ప్రజా జీవితంలో

# ఈ రోజు నాకు చిరస్మరణీయం

## - డాక్టర్ శిరీష, తిరుపతి మేయర్

**తిరుపతి ప్రెస్ క్లబ్ –ఆంధ్రనాడు, మార్చి 16:** తిరుపతి నగరపాలక సంస్థకు తొలి మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజును ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండేదాన్ని. కానీ మేయర్‌గా కార్యాలయంలో చివరి రోజు సిబ్బందిని కలిసి చిరుద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు చూపించిన ఆప్యా యతలు, నాకన్నా ఎక్కువ భావోద్వేగాలకు లోనైనప్పుడు నాకు మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన మధురమైన రోజును మొదటి సారి మరిచి పోయాను. ప్రజా జీవితంలో ఈ రోజు నాకు చిరస్మం ణీయమైన రోజు. ఒక సాధారణ కుటుంబం, రాజకీయ నేపథ్యం లేదు అయినా నాకు తిరుపతి నగరానికి తొలి మేయర్ గా పనిచేసే అవకాశం రావడమే గొప్ప అరుదైన గౌరవం. ఒక డాక్టర్‌గా అనేక క్లిష్టమైన కేసులను చూసిన నాకు ఈ రోజు కార్యాలయంలో ఇదే చివరోజు కావడం, సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పే సమయంలో వారు కన్నీళ్లు పెట్టుకుని సాగనంపినప్పుడు నేను ఒత్తిడిని తట్టుకోలేక పోయాను. ప్రజా జీవితంలో ఇంత గొప్ప అనుభూతి ఉంటుందా, ప్రజాస్వామ్యం, రాజకీయ ప్రక్రియలో పాల్గొంటే ఇంతటి ఆదరణ లభిస్తుందా అని ప్రశ్నించుకుని నేను రాజకీయాలలోకి వచ్చి మంచి పని చేసాను అని మొదటి సారి అనిపించింది.నిజానికి నేను వ్యక్తిగతంగా నగర మేయర్‌గా ఏమి చేశాను. ఎందుకు చివరి మజిలీ సందర్భంగా అంతగా బాధపడ్డారు అని నన్ను నేను ప్రశ్నించుకుంటే నాకు అర్థం అయినది







ఒక్కటే రాజకీయ జీవితంలో ప్రజలకు మనం ఏమి చేశాము అనే దాని కన్నా మనల్ని ఎన్నుకున్న ప్రజలతో ఎలా ఉన్నాము అన్నది కీలకమని అర్థం చేసుకున్నాను. మనల్ని ఎన్నుకున్న ప్రజల పట్ల మనకు అవకాశం ఇచ్చిన పార్టీ పట్ల విధేయత.. ప్రజా జీవితంలో విలువలు విశ్వసనీయతతో ఉండటం రాజకీయ నాయకులు ప్రాథమిక బాధ్యత.. ఈ విషయంలో నేను అలా ఉండ గలిగాను అన్న సంతృప్తి నాకు కలిగింది. కార్యాలయంతో మేయర్ గా చివరి మజిలీ సందర్భంగా చిరు ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు ఈ ఐదు సంవత్సరాల పాలనలో చేసిన మంచి పనులు వారితో పెనవేసుకున్న అనుబంధం ఈ రోజుతో ముగిసిపోతుంది అని అనుకున్నప్పుడు సిబ్బందితో పాటు నాకూ కన్నీళ్లు వచ్చాయి.. కన్నీళ్లు ఎప్పుడూ బాధకు చిహ్నం కానీ ఈ నాటి కన్నీళ్లు ఆనందాన్ని ఇచ్చాయి. నేను ఏదో పోగొ ట్టుకున్నాను అనడం కన్నా ఏదో సాధించి కార్యాలయం నుంచి వెళుతున్నాను అన్న సంతృప్తి కలి గింది. కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష ప్రతి ఉద్యోగి వద్దకు వెళ్లి వినమ్రంగా ధన్యవాదాలు చెప్పారు. చివరిగా నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య కార్యాల యంలో కాసేపు కమిషనర్ అదనపు కమిషనర్ తో గడిచిన అనుభవాలను నెమరు వేసుకున్నారు. అటు పిమ్మట కార్యాలయం అధికారులకు వాహనం అప్పగించి తన వ్యక్తిగత వాహనంలో బయలుదేరి వెళ్ళారు.

# మంచినీళ్ల కుంట శివాలయమును సందర్శించిన శృంగేరి పీఠాధిపతి



**తిరుపతి (ఎస్వీయూ) ఆంధ్రనాడు, మార్చి 16:** సోమవారం తిరుపతి నగరంలోని మంచినీళ్ల కుంట శివాలయమును శృంగేరి పీఠాధిపతి శ్రీ శృంగేరి విధుశేఖర తీర్థ స్వామి వారు విచ్చేసి అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామివారిని పూజించి, తదనానంతరం భక్తులను ఆశీర్వదించారు. కాగా వీరిని పూర్ణకుంభంతో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ శర్మ, మణి స్వామి తదితరులు స్వాగతం పలికారు.

# అంగళ్లు పంచాయతీకి వేలం పాటల్లో కోటి1.5 లక్షలు ఆదాయం



**కురబలకోట –ఆంధ్రనాడు మార్చి 16 :** కురబలకోట మండలం అంగళ్లు గ్రామపంచాయతీకి పంచాయతీ చెందిన వేలంపాటల్లో రూ కోటి ఐదు లక్షల రూపాయలు ఆదాయం వచ్చింది. సోమవారం అంగళ్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పో రెడ్డి విశ్వనాథరెడ్డి అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. గొర్రెల సంతను 44 లక్షల 50 వేలు కు వేలం పాటల్లో అంగలకు చెందిన టిడిపి నాయకుడు తోట అశోక్ కుమార్ దక్కించుకున్నాడు. గొర్రెల సంతను వాయల్పాడు మండలం చింతపర్తికి చెందిన ద్వారకనాథ్ రెడ్డి 53 లక్షలు మూడు వేల రూపాయలకు ఈ వేలం పాటల్లో కైవాసం చేస్తున్నాడు. కురబలకోట గ్రామం జంగా వారి పల్లికి చెందిన జంగా హరినాథ్ రెడ్డి వారపు కూరగాయల సంతను ఎనిమిది లక్షల వేయి రూపాయలకు వేలం పాటల్లో దక్కించుకున్నాడు. మదనపల్లి డి ఎల్ పి ఓ నాగరాజా పర్యవేక్షణలో ఈ వేలంపాటలు నిర్వహించగా, ఎంపీడీవో గంగయ్య ,డిప్యూటీ ఎంపీడీవో బాలమూర్తి ,గ్రామ సెక్రెటరీ ఉదయ్ కుమార్ అధిక సంఖ్యలో గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

### కడప సంస్కృతిని

# తిరుపతిలో ప్రోత్సహిస్తున్న భూమన

## -తిరుపతి డిప్యూటీ మేయర్, ఆర్సి మునికృష్ణ
## - టిటిడి చైర్మన్ అడ్డుకోవడం పై ఖండన

**తిరుపతి ప్రెస్ క్లబ్ –ఆంధ్రనాడు, మార్చి 16:** కడప సంస్కృతిని తిరుపతిలో మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ప్రోత్సహిస్తున్నారని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతిని ధి ఊట్ల సురేంద్ర నాయుడు ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ... తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండల అధ్యక్షులు బిఆర్ నాయుడు కుటుంబ సమేతంగా తిరుపతికి విచ్చేసి గ్రాండ్ రిడ్జ్ హోటల్ నందు అల్పాహారాన్ని స్వీకరిస్తున్న సందర్భంలో తిరుపతి మాజీ శాసనసభ్యులు కరుణాకర్ రెడ్డి అనుచ రులు నిషేధిత మత్తు పానీయాలు సేవించి బి ఆర్ నాయుడు వారి కుటుంబ సభ్యులను అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నామని, మునుపు ఎన్నడు తిరుపతి చరిత్రలో ఇలాంటి సంఘటనలు జరగలేదని, భూమన కరుణాకర్ రెడ్డి గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో తనయుడు అభినయ రెడ్డి, కరుణాకర్ రెడ్డి తిరుమలలో ఇద్దరు కలిసి చేసినటువంటి అవినీతి అక్రమాలు, పరకామణి కుంభకోణం దగ్గర నుండి లడ్డులో కల్తీ నెయ్యి, టీడీఆర్ బాండ్ల కుంభకోణం, కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి స్థానిక




ఎన్నికల్లో దొంగ ఏ పిక్ కార్డులతో దాదాపు 30 వేల దొంగ ఓట్లు సృష్టించడం, దీనికి ఒక ఐపీఎస్ ఆఫీసర్ బలి కావడం కూడా తిరుపతి ప్రజలు మర్చిపోలేదని, కో–ఆపరేటివ్ బ్యాంక్ లో దొంగ ఓట్ల పర్వం తో పాటు తిరుపతి మున్సిపల్ ఎన్నికలలో వీరు చేసిన అకృత్యాలు ప్రజలు మర్చిపోవాలని కొత్త నాటకాన్ని తెర తీశారు . కడప సంస్కృతిని తిరుపతిలోకి తీసుకురావడానికి తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరి ంచారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తలుచు కుంటే కరుణాకర్ రెడ్డి ఇంట్లో నుండి అడుగు బయట కూడా పెట్టలేదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.. బిఆర్ నాయుడు తిరుమల తిరుపతి చైర్మన్ అయిన తర్వాత భూమన కరుణాకర్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, చేసిన అవినీతి అక్రమాలు అన్నింటిని బయటకు తీసి చట్ట ప్రకారం శిక్ష విధిస్తాడని భయంతో బిఆర్ నాయుడు ని మానసికంగా దెబ్బతీయడం కోసం కరుణాకర్ రెడ్డి ఆడుతున్న నాటకాలు యావత్ హిందూ సమాజం తీవ్రంగా ఖండిస్తుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఐదు సంవత్సరాల కరుణాకర్ రెడ్డి తిరుపతి శాసనసభ్యుడుగా, తిరుమల తిరుపతి పాలకమండలి అధ్యక్షుడిగా తిరుపతి అభివృద్ధి ఏమాత్రం చేయలేదని వారి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం మాత్రమే ఆయన ప్రయత్నం చేశాడని కరుణాకర్ రెడ్డి రాజకీయ జీవితం అంతా దోపిడీలు భూకబ్జాల తోనే సాగిందని మీరు చేసిన అవినీతి అక్రమాలన్నీ బిఆర్ నాయుడు బయటికి తీసి మిమ్మల్ని చట్టం ముందు దోషిగా నిలబెడతాడని భయంతో బిఆర్ నాయుడుపై దాడికి తెగబడితే హిందూ సమాజంతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రజక సాధికార సమితి కార్యదర్శి శంకర్, సుధాకర్ రెడ్డి, జగ్గా, ధన, నాగ ప్రతాప్, పెంచలయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు హెచ్ పి వి టీకాలు సంరక్షణ



**కురబలకోట–ఆంధ్రనాడు,మార్చి 16 :** ఆడపిల్లల సంరక్షణ కోసం హెచ్ పి వి టీకాలు ఎంత సురక్షితమని మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షులు శెట్టి సీతారాం బాబు అన్నారు.కురబలకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆడపిల్లలకు హెచ్ పి వి టీకాలను సోమవారం వేశారు. 20 11–20 12 సంవత్సరాలలో పుట్టిన ఆడపిల్లలకు భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నివారణకు గాను హెచ్ పి వి టీకాలను వేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చక్రపాణి తెలిపారు. ఈ వయసులో ఉన్న ఆడపిల్లలందరూ టీకాలు వేసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ మనీషా సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# ఎస్వీయూలో ఘనంగా ఉగాది వేడుకలు

## - అలరించిన కవి సమ్మేళనం, కోలాట ప్రదర్శన

**తిరుపతి (ఎస్వీయూ), ఆంధ్రనాడు, మార్చి 16:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖ, ఈతరం కవితా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది వేడుకల సందర్భంగా వివిధ కార్యక్రమాలను వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ కలిసి ప్రారంభించారు. తెలుగు అధ్యయన శాఖ పూర్వ విద్యార్థి వెంకటేష్ నేతృత్వంలో కోలాట ప్రదర్శన భక్తి గీతాలతో అందర్నీ అలరించింది. అనంతరం తెలుగు విభాగంలో ఉగాది వేడుకలు చేపట్టి, అందరికీ ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈతరం కవితా వేదిక గౌరవాధ్యక్షులు, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్జీడి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతికీ మనిషికీ గల అనుబంధాన్ని గుర్తుచేసేది ఉగాది పండుగ అని తెలిపారు. ప్రతి ఉగాదికి కవి సమ్మేళనం నిర్వహించడం



ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఈతరం కవితా వేదిక అధ్యక్షులు తోట వేంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత మన సంస్కృతి సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఉగాది పండుగ వసంత రుతువునూ, కోయిల పాటలను తెస్తుందన్నారు. దూబగుంట రామకృష్ణ, ఆకుల మల్లేశ్వరరావు, రెడ్డిపల్లి షాజహాన్, రవితో పాటు సుమారు 20 మంది కవులు కవితా పఠనం చేశారు. ఇందులో కె. శృతి, విద్య, బాలకృష్ణ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పొందారు. ఈ కవి సమ్మేళనానికి న్యాయ నిర్ణేతగా విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ వ్యవహరించారు. ఉగాది వేడుకల్లో భాగంగా చేపట్టిన పద్య పఠనం, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పుస్తక బహుమతులను అందజేశారు.

**జక్కంపూడికి నివాళులు:** ఇటీవల కన్నుమూసిన ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు జక్కంపూడి మునిరత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. తెలుగు విభాగంలో పరిశోధకులుగా, అధ్యాపకులుగా ఆచార్య జక్కంపూడి మునిరత్నం ఎంతో కృషి చేశారని తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, విభాగ విశ్రాంత ఆచార్యులు తదితరులు కొనియాడారు. ఈ శారద, సౌభాగ్యమ్మ, అతిథి అధ్యాపకులు ఆదిశేషయ్య, సునీల్ కుమార్, అశోక్, , పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రదోషకాల పూజ

**కాణిపాకం- ఆంధ్రనాడు, మార్చి 16:** వైభవంగా ప్రదోషకాల పూజ కార్యక్రమం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయము నందు ఈరోజు సాయంత్రం ప్రదోషకాల పూజ సందర్భంగా వైభవంగా స్వామివారి మూలవిరాట్ మరియు నందీశ్వరుడుకి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకములు, మరియు ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.



ANDHRANADU
TELUGU DAILY

మంగళవారం
17.03.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

## అపోలో చెన్నై సమాచార కేంద్రం ప్రారంభం




**తిరుపతి –ఆంధ్రనాడు, మార్చి 16:** తిరుపతి ప్రాంత రోగులకు అధునాతన సేవల్ని అందించడానికి , రోబోటిక్ చికిత్స ను బలోపేతం చేసే దిశగా తిరుపతి తుడా రోడ్డులో అపోలో హాస్పిటల్స్ చెన్నై సమాచార నూతన కేంద్రాన్ని ప్రారంభి స్తున్నట్లు డాక్టర్లు శ్రీకాంత్ శ్రీనివాస, అజయ్ నరసింహన్ లు మీడియా సమావేశం లో తెలియజేశారు. డాక్టర్లు మాట్లాడుతూ... అన్ని రకాల రోగులకు అత్యాధునిక వైద్యంతో ఆరోగ్యవంతులుగా మార్చడం అపోలో వైద్యుల ప్రత్యేకతని తెలిపారు. ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవల్ని అందించ దానికి అపోలో ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలియజేశారు.

## ఆక్రమణదారుల నుండి ఆలయ భూమిని కాపాడండి

### - జిల్లా కలెక్టరుకి మడికయ్యుల శివాలయం కమిటి వినతి



**మదనపల్లి –ఆంధ్రనాడు, మార్చి 16:** ఆక్రమణదారుల నుండి ఆలయ భూమిని కాపాడాలని శ్రీయోగభోగేశ్వర స్వామి (మడికయ్యల శివాలయం) ఆలయ కమిటీ సభ్యులు సోమవారం పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కి విన్నవించుకున్నారు.ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ కొప్పల వెంకటరమణ డైరెక్టర్లు పసుపులేటి వరప్రసాద్,కలిశం ప్రకాష్ నాయుడు,శివకుమార్,చామంచుల మల్లిక, భవానిలతో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ కొప్పల వెంకటరమణ మాట్లాడుతూ చిప్పిలి గ్రామం,పప్పిరెడ్డిగారిపల్లె పరిధిలో సర్వే నెంబర్ 7/3ఎలో 41 సెంట్లు ఆలయానికి సంబంధించిన భూమి ఉందన్నారు.అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.రెవెన్యూ రికార్డులైన అడంగల్ 10 (1),ఆర్.ఓ.ఆర్ నందు సైతం ఆ భూమి మడికయ్యల శివాలయానికి చెందినదిగానే చూపిస్తోందన్నారు.కావున జిల్లా కలెక్టర్ సర్వేయర్ ద్వారా సదరు దేవాదాయశాఖకు సంబంధించిన భూమిని సర్వే చేయించి సరిహద్దు రాళ్లు నాటించి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఎవరైనా సదరు భూమిని ఆక్రమించుకున్నా వారిని ఖాళీ చేయించాలని ఆలయ కమిటీ తరపున కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు.

## శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వారిపై దాడికి దిగడం అమానుషం

### - తిరుపతి వైసీపీ సమన్వయకర్త, భూమన అభినయ్ రెడ్డి








**తిరుపతి ప్రెస్ క్లబ్ – ఆంధ్రనాడు, మార్చి 16:** సోమవారం టీటీడీ చైర్మెన్ బస చేసిన ఒక ప్రైవేట్ హోటల్ నందు నిరసన తెలియజేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలను తిరుచానూరు పోలీసులు అరెస్ట్ చేశారు.అరెస్టయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ను పరామర్శించిన తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడుతూ...టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు రాజీనామా చేయాలని శాంతి యుత నిరసన చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలుపై టీడీపీ గుండాలు భౌతిక దాడులు చేశారు. మహిళలు అని కూడా చూడకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాళ్లపై టీడీపీ గుండాలు దాడి చేశారు.తిరుపతిలో ఇలాంటి విష సంస్కృతి ఎప్పుడూ తీసుకురాలేదు.పోలీసులు సమక్షంలో భౌతిక దాడులు చేసిన వారిని వదిలి వేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్ట్ చేశారు.పోలీసులు చాలా అప్రజాస్వామి కంగా వ్యవహరిస్తున్నారు, ఇది సరైన చర్యలు కావు.మావాళ్ళు ఇచ్చిన ఫిర్యాదుపై టీడీపీ గుండాలు పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తిరుచానూరు పోలీస్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## మిట్స్‌లో క్లౌడ్ కంప్యూటింగ్‌పై హాండ్స్ ఆన్ వర్క్‌షాప్



**కురబలకోట– ఆంధ్రనాడు, మార్చి 16:** మదనపల్లి సమీపంలోని మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్--ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో "అమెజాన్ వెబ్ సర్వీసెస్, డాకర్ టెక్నాలజీలను ఉపయోగించి పరి శ్రమల్లో క్లౌడ్ కంప్యూటింగ్ వినియోగం" అనే అంశంపై హాండ్స్ ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరులోని అమృత విశ్వ విద్యా పీఠం స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. దినేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్లౌడ్ టెక్నాలజీలను అర్థం చేసుకొని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొం దించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. తక్కువ ఖర్చుతో అధిక సామర్థ్యాన్ని అందించే క్లౌడ్ సేవలు, డేటా భద్రత, బ్యాకప్ సదుపాయాలు ఆధునిక ఐటీ రంగంలో అప్లికేషన్ల అభివృద్ధికి ఎంతో ఉపయో గకరమని వివరించారు.వర్క్‌షాప్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏయు ఎస్ ) క్లౌడ్ సేవలు, డాకర్ టెక్నాలజీ, ఆటోమేషన్ విధానాలు, అప్లికేషన్లను క్లౌడ్‌లో అమలు చేయడం, వాటి సమన్వయం వంటి అంశాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. క్లౌడ్ ఆధారంగా అప్లికేషన్ల అభివృద్ధి, నిర్వహణపై అవగాహన కల్పించారు. క్లౌడ్ కంప్యూటింగ్, డేవ్‌ఓప్స్, కంటైనర్ టెక్నాలజీలపై నైపుణ్యాలు పెంపొందించుకుంటే భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఆర్. కల్పన, కో–ఆర్డినేటర్లు ఎ. నాగలక్ష్మి, ధనలక్ష్మి, అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఉత్పత్తులను ఆదరించండి శాసనమండలి చీఫ్ విప్,కంచర్ల శ్రీకాంత్




**రామకుప్పం –ఆంధ్రనాడు, మార్చి 16:** రామకుప్పంలో ఆర్గానిక్ స్టోర్‌ను శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్ సోమవారం ప్రారంభించారు సేంద్రీయ ఉత్పత్తుల ద్వారా సేకరించిన చిరుధాన్యాలు ఇతర కాయగూరలు ద్వారా చేసిన మంచి వస్తువులు ద్వారా ఉత్పత్తి అయినవి ఇక్కడ విక్రయిస్తారు దీనిని ప్రజలు ఆదరించాలని శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు రసాయనిక ఎరువులు వాడి ఉత్పత్తి అయ్యేవి వాటి వల్ల లేని జబ్బులు వస్తాయని సేంద్రియ వ్యవసాయం పదార్థాలు వాడితే ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలో ఇది కూడా ఒక భాగమని ఆయన పేర్కొన్నారు, గ్రామీణ ప్రాంతాలలో దీన్ని ఏర్పాటు చేయడం చాలా మంచిదని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రామకుప్ప 0మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద రెడ్డి ఆంజనేయ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కా మరాజు నాయక్ రే స్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, ఎంపీపీ సులోచన గుర్రప్ప వైస్ ఎంపీపీ వెంకటరమణ గౌడు , క్లస్టర్ఇంచార్జ్ రవి రెడ్డి, పట్టర నారాయణఇంకా పలువు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## దేశం రాష్ట్రంలో గ్యాస్ పెట్రోల్ కొరత లేదు

### - జిల్లా బిజెపి అధ్యక్ష కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు అట్లూరి శ్రీనివాసులు

**రామకుప్పం –ఆంధ్రనాడు, మార్చి 16:** ఇరాన్ యుద్ధం వల్ల ప్రజలు గ్యాస్ పెట్రోలు ఇంధన వనరులు ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు అందే విధంగా పాలన సాగిస్తున్నారని చిత్తూరు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు పేర్కొన్నారు దీని ఓర్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఉనికి కోసం గ్యాస్ పెట్రోల్ ఇంధన వనరులు ప్రజలకు అందుబాటులో లేవని చౌకబారు స్టేట్మెంట్లు ఇస్తున్నారని దీనికి తోడు కమ్యూనిస్టు పార్టీలు కూడా వంతపడుతున్నాయన్నారు అనుచనం నిత్యావసర వస్తువులు గ్యాస్ పెట్రోల్ ప్రజలకు అందే విధంగా చూస్తున్నది చూసి మీరు ఓర్వలేకపోతున్నారని ఇది పద్ధతి కాదని వారు హెచ్చరించారు గ్యాస్ పెట్రోల్ సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే అక్కడున్న స్థానిక తహసీల్దారులు దృష్టికి ప్రజలు తీసుకురావాలని దీనిపై జిల్లా కలెక్టర్ నీ కలిసి హెల్ప్ లైన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు ఎక్కడైనా గ్యాస్ ను అధిక ధరలకు అమ్మితే అటువంటి వారిపై స్థానిక అధికారులకు బిజెపి నాయకులు కార్యకర్తలు ఫిర్యాదు చేయాలని వారు పిలుపునిచ్చారు.






## గోశాలకు పశుగ్రాసం వితరణ

**పలమనేరు– ఆంధ్రనాడు, మార్చి 16 :** పలమనేరు రూరల్ మండలం జగమర్ల పంచాయతీ పరిధిలోని దేవళంపేటలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ వందన మల్లేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా కీలపట్ల అన్నం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గోశాలకు పలమనేరు పరిరక్షణ సమితి మరియు దాత శేగు రాఘవయ్య సహకారంతో ఒక మినీ లారీ ఎండు వరి పశుగ్రాసాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీపీఎస్ అధ్యక్షుడు నరసింహులు, గౌరవాధ్యక్షుడు ఆనందబాబు, కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ... వేసవి కాలంలో పశువులకు పచ్చిక లభ్యం కష్టం అయ్యే పరిస్థితుల్లో, గోశాలలోని పశువుల సంరక్షణ కోసం పశుగ్రాసం సమకూర్చడం సహేతుకమని తెలిపారు. అన్నం సొసైటీకి చెందిన శ్రీధర్ స్వామి గోశాల నిర్వహణకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో దొరస్వామి, జగన్నాథం, విజయకుమార్,రామచంద్ర, వీరభద్ర గౌడు, శ్రీపురం సీతారామయ్య, రెడ్డప్ప, పొన్ముడి, సాంబయ్య, శేఖర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


## శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా ప్రసాద వితరణ

### - దాతలకు సన్మానం



**పలమనేరు–ఆంధ్రనాడు, మార్చి 16:** స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దాత విశ్వనాథరెడ్డి మరియు మహేష్ సౌజన్యంతో స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన వందలాది మంది భక్తులకు దాతల సహకారంతో ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రసాద వితరణ ధాతలును ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ మంజునాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ అర్చకులు కుమార్, చంద్రమౌళి గురుకుల్ వేద ఆశీర్వ చనాలతో, కమిటీ సభ్యులు శాలువా కప్పి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కుట్టి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జయశంకర్, గంటె శివ, ఆలయ కమిటీ సభ్యులు ఎంటిఆర్ ప్రసాద్, రెడ్డప్ప, బాబు, వీరప్ప తో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రదోష పూజలు



**నాగలాపురం – ఆంధ్రనాడు, మార్చి 16:** నాగలాపురం మండలం సురుటు పల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి పి.లత సమక్షములో ప్రదోష పూజలు నిర్వహించారు. ప్రదోషం సందర్భంగా శ్రీ నందీశ్వర స్వామి, శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి అమ్మవార్లను ప్రదోష నందీశ్వర స్వామి వారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యములు, మహాదీపారాధనలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదం, పుష్పాలంకరణ ఉభయదారులుగా పొన్నేరికి చెందిన బాలకృష్ణ ప్రేమ కుమార్, తిరుపతికి చెందిన కోటేశ్వర రావు, నింద్రకు చెందిన శ్రీనివాస్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఉభయదారులుగా వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పి.హంసరుద్రయ్య, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



## ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణం త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు

### - పీలేరు శాసనసభ్యులు నల్లారి



**పీలేరు–ఆంధ్రనాడు,మార్చి 16:**శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పీలేరు పట్టణంలోని వెలుగు కార్యాలయం దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించినతెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణం త్యాగం చేసిన మహనీయుడు ఆయన త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని అన్నారు.ఆయన చేపట్టిన 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర రాజధాని అమరావతిలో శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరింప చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లి బాబురెడ్డి, ఆర్య వైశ్య సంఘం కార్యదర్శి రేవూరి సుధీర్, జాయింట్ సెక్రటరీ చింతలపల్లి రాజేష్, నల్లారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమ వైపు అడుగులు





**చంద్రగిరి –ఆంధ్రనాడు, మార్చి 16 :** కూటమి ప్రభుత్వ పాలనలో మండల సర్వసభ్య సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారం అభివృద్ధి సంక్షేమం వైపు అడుగులు వేసే విధంగా నిర్వహిస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి ఎంపీడీవో కార్యలయంలో సోమవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు,కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 16 నుంచి ఏప్రిల్ 29 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు చెప్పారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల సర్వసభ్య సమావేశాలు తూతూ మంత్రంగా జరిగేవని, అలాంటివాటిని కూటమి ప్రభుత్వం అర్థవంతమైన చర్చా కార్యక్రమంగా మార్చిందని గుర్తు చేశారు. గ్రామాలలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను ఎంపీపీ, గ్రామ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, జెడ్పీటీసీని అడిగి తెలుసుకున్నారు.పార్టీలకు అతీతంగా ప్రతి సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు చేపడతామని సభాముఖంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం నుంచి ఇప్పటివరకు చంద్రగిరి మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనులను వివరించారు. ఇంకను చేపట్టబోయే నిధులు మంజూరు చేయించనున్నట్లు ప్రకటించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులకు సమస్యలను తెలిపి తక్షణమే పరిష్కారం చేయాలని ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారుల పై శాఖా పరమైన చర్యలు తీసుకొనే విధంగా చూడాలని ఎంపీడీవోకి సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చీలంపల్లి వద్ద ఆటో, ట్రాక్టర్, బోలోరా ఢీ

### - రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు






**బైరెడ్డిపల్లి– ఆంధ్రనాడు, మార్చి16:** మండల కేంద్రంలోని బైరెడ్డిపల్లి టూ పలమనేరు కు వెళ్లే జాతీయ రహదారిలో సోమవారం రాత్రి 9.00 గంటల ప్రాంతంలో చీలంపల్లి గ్రామం వద్ద బైరెడ్డిపల్లి నుండి వెళ్తున్న ఆటో,పలమనేరు నుండి వస్తున్న బోలోరో పక్క నుండి వచ్చిన ట్రాక్టర్ ఢీ కొనడంతో ఆటో లో ప్రయాణిస్తున్న రామకృష్ణారెడ్డి (45), నారాయణ శెట్టి (50) కు గాయాలు అయ్యాయి. వీరిని 108 సాయంతో బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో బోలోరో తప్పించుకొని సంఘటన స్థలం నుండి పరార్ కావడం జరిగింది. ట్రాక్టర్ డ్రైవర్ రాజగోపాల్ రెడ్డి పక్క నుండి జాతీయ రహదారి మీదకు రావడంతో ఈ ఘటన జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అమరజీవి పొట్టి శ్రీరాములు, ప్రాణ త్యాగ ఫలితమే తెలుగు జాతి ఉనికి

### - ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ రవి ప్రభు



**తిరుపతి ప్రెస్‌క్లబ్ –ఆంధ్రనాడు,మార్చి 16:** పట్టుదలకు, కార్యదక్షతకు మారుపేరు అమరజీవి పొట్టి శ్రీరాములని, ఆయన ప్రాణ త్యాగ ఫలితమే తెలుగు జాతి ఉనికి అని ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు కొనియాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాముల 125 జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉమ్మడి మద్రాసులో తెలుగు వారికి ఎన్నో అవమానాలు జరిగేవని, వాటిని తాళలేక పొట్టి శ్రీరాములు ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ దీక్ష చేశారని గుర్తు చేశారు.ప్రత్యేక రాష్ట్ర సాధనకు 1952 అక్టోబర్ 19న మద్రాసులోని బులుసు సాంబమూర్తి ఇంట వద్ద ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారన్నారు. అదే పట్టుదలతో 58 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసిన 15 డిసెంబర్ 1952 రాత్రి చివరి శ్వాస విడిచిపెట్టారని అన్నారు. ఆయన ప్రాణ త్యాగ ఫలితమే తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింద న్నారు. పొట్టి శ్రీరాముల పట్టుదలను మహాత్మ గాంధీ మెచ్చుకొనలేకుండా ఉండలేకపోయే వారన్నారు. పొట్టి శ్రీరాముల వంటి నాయకులు పది మంది ఉంటే భారతదేశానికి ఏడాదిలోనే స్వాతంత్ర్య తీసుకురావొచ్చిన అప్పట్లో మహాత్ముడు కొనియాడే వారన్నారు. మహాత్ముని వ్యాఖ్యల బట్టే అర్థమవుతోందని పొట్టి శ్రీరాములు ఎంతటి పట్టుదల కలిగిన వ్యక్తో అని అన్నారు. హరిజనోద్ధరణకు పొట్టి శ్రీరాములు విశేష కృషి చేశారన్నారు. దేవాలయాల్లో హరిజనులకు ప్రవేశం కోసం కూడా పొట్టి శ్రీరాములు మద్రాసులో ఆమరణ దీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు.తెలుగు జాతి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ప్రాణాలు ఆర్పించిన పొట్టి శ్రీరాముల సేవలు భావితరాలకు తెలియాలన్న ఉద్దేశంతో ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినంగా సీఎం చంద్ర బాబునాయుడు ప్రకటించారన్నారు. ప్రతి ఏటా డిసెంబర్ 15న రాష్ట్ర కార్యక్రమంగా, అధికారికంగా ఆత్మార్పణ దినం నిర్వ హించాలని ఆదేశాలు జారీచేశారన్నారు. పొట్టి శ్రీరాముల పట్టుదల, అంకుఠిత దీక్ష నేటి యువతకు ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ డి ఎస్ ఎన్ మూర్తి , డాక్టర్ ఏఎస్ కిరీటి , డాక్టర్ జయచంద్ర నాయుడు, డాక్టర్ జగదీష్, డాక్టర్ యామిని, వైద్యులు, వైద్య అధ్యాపకులు, వైద్య సిబ్బంది, కళాశాల ఆఫీస్ సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, ఆఫీసు సూపరిటెండెంట్ రేణుక, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ సెక్రటరీ ఏటుకూరి గిరిబాబు, తిరుపతి జిల్లా అధ్యక్షులు ఏపీ ఎన్జీవోస్ సురేష్ బాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు కేసి సుబ్రహ్మణ్యం, మురళి, అనాటమీ విభాగం, మరియు ఎస్వీ వైద్య కళాశాల పి.ఆర్.ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి



**తిరుపతి ప్రెస్‌క్లబ్ –ఆంధ్రనాడు,మార్చి 16:** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా రుయా ఆస్పత్రి సర్కిల్ లోనిఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్యలు సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులు పొట్టి శ్రీరాములు అన్నారు. మద్రాసు రాష్ట్రంలో తెలుగువాళ్ళు పడిన అవమానాలు, కష్టాలను చూసి తట్టుకోలేక ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఆయన అన్నారు. 58 రోజులు పొట్టి శ్రీరాములు దీక్ష చేసి అమరుడు కావడంతోనే దేశంలో భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు బీజం పడిందని ఆయన చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భావితరాలకు చాటేలా అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సోమవారం ప్రారంభించారని ఆయన తెలిపారు. ఆర్య వైశ్యుల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి కట్టుబడి ఉందనని ఆయన చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కన్య కాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళాభివృది కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, శ్రీధర్ వర్మ, బిజి కృష్ణయాదవ్, రాజా రెడ్డి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు దండుకుర్తి నరసింహులు, రాజా రెడ్డి, క్రికెట్ విజయ్, కీర్తన, సుభాషిణి, ఆముదాల వెంకటేష్, వెంకటేశ్, నీలాద్రి, లచ్చి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, మధు, రమేష్ నాయుడు, వినోద్ రాయల్, జీవన్, శిరీషా, దిలీప్, సరిత నాగరాజు, ఆళ్వార్ మురళీ తదితరులు పాల్గొన్నారు .

**పెద్దపంజాణిలో..**
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం



పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎన్.రెడ్డప్ప మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో బాలాజీ, ఉపాధి హామీ ఏపీఓ మురుగేషన్, ఏపీఎం నీరజ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, పరిపాలనాధికారి సురేంద్రరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, ఉపాధి హామీ, వెలుగు, విద్యాశాఖ మండల ప్రజా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

**వెదురుకుప్పంలో..** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్‌డజీడీ నెల్లూరు ఎమ్మెల్యే డా. వి.ఎం థామస్ ఆదేశాల మేరకు వెదురుకుప్పం మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు మోహన్ మురళి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మోహన మురళి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఈనాటికీ మనకు స్ఫూర్తి అన్నారు. మహాత్మ గాంధీ అడుగుజాడల్లో నడచి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్న ఆయన జీవితంలో ఎన్నో పోరాటాలు చేశారని, భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం, ముఖ్యంగా తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం సాధించడం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల నాయకులు రమణారెడ్డి, విక్రమ్ రెడ్డి, వరప్రసాద్, మనోహర్ నాయుడు, రాజశేఖర్ వర్మ, ఆనంద్ రెడ్డి, అనిల్, సుధాకర్ రెడ్డి,వెంకటేష్, రాణి, తిరుమలరెడ్డి, మదనమోహన్ రెడ్డి,యువకుమార్ రెడ్డి, రాజాజీ, బాలాజీ నాయుడు,తులసిరామ్ యాదవ్, ఏఎంసి రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,తిమ్మరాజు, ప్రశాంత్, మహేష్, జయ రామయ్య, భూపతి,నాగరాజు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పంలో..** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆశు వులు బాసిన పొట్టి శ్రీరాములు జయంతిని రామకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు పొట్టి శ్రీరాములు ఫోటోకి పూలమాలవేసి పూజలు చేసి నివాళులు అర్పించారు పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పోరాటం సంబంధించిన చరిత్రను వివరించారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎంపీడీవో మురళీకృష్ణారెడ్డి ,తాసిల్దార్ కౌలేష్, డిప్యూటీ తాసిల్దార్ బాలాజీ సిబ్బంది వినోద్ హరి ప్రసాద్ రెడ్డి శరవణ ఇంకా పలువురు ఉన్నారు.





## ఆర్ఎంపి వైద్యం వికటించి వృద్ధుడు మృతి

### - కడుపు నొప్పితో ఆర్ఎంపి డాక్టర్ రమణ వద్దకు వచ్చి సిద్ధప్ప మృతి



**బైరెడ్డిపల్లి– ఆంధ్రనాడు, మార్చి16:** మండలంలోని కడతట్ల పల్లి గ్రామానికి చెందిన సిద్ధప్ప (70), జ్వరం, కడుపు నొప్పితో సోమవారం సాయం కాలం 4.00 గంటల ప్రాంతంలో బైరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు రమణ క్లినిక్‌కు వచ్చి, చికిత్సలు నిర్వహించుకొన్నాడు. దానికి తగ్గట్టు రెండు ఇంజక్షన్స్, ఒక గ్లూకోజ్ బాటిల్ పెట్టడంటా డాక్టర్ రమణ.గ్లూకోజ్ బాటిల్ అర్థం పోయిన వెంటనే చనిపోయాడని స్థానికులు తెలిపారు. గతంలో కూడా ఇతని వద్దకు వచ్చిన రోగులు ఇలాగే మృతి చెందారు.కానీ రూల్స్ కు విరుద్ధంగా ప్రాక్టీస్ నడుపుతున్నా.. ఉన్నతాధికా రులు చర్యలు కరువనీ బైరెడ్డిపల్లి మండల ప్రజలు వాపోతున్నారు.

## బైరెడ్డిపల్లిలో హోటళ్లు, టీ స్టాల్‌ల్లో వినియోగిస్తున్న గృహ వినియోగ గ్యాస్

### - 6 సిలిండర్లు సీజ్

**బైరెడ్డిపల్లి –ఆంధ్రనాడు, మార్చి16:** మండల కేంద్రం అయిన బైరెడ్డిపల్లిలో సోమవారం హోటల్స్, టీ దుకాణాలను మండల తహ సీల్దార్ ప్రసన్నకుమార్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హోటళ్లు,టీ స్టాల్ ల్లో వినియోగిస్తున్న గృహావినియోగ గ్యాస్ 6 సిలెండర్స్ ను ఆయన గుర్తించి సీజ్ చేశారు.ఎవరైనా వాణిజ్య సిలెండర్ ల స్థానంలో గృహ వినియోగ సిలెండర్ వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనం తరం స్థానిక గ్యాస్ కార్యాలయంలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డ్స్ పరిశీలించి డీలర్‌కు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. బైరెడ్డిపల్లి మండలంలో గ్యాస్ కొరత లేదని తహసీల్దార్ ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఆర్.ఐ. దామోదరఆఛారి, వి.ఆర్.ఓ. రాజేష్,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ANDHRANADU
TELUGU DAILY

మంగళవారం
17.03.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# టీటీడీ నిత్యాన్నదాన పథకానికి కూరగాయల వితరణ



**పలమనేరు– ఆంధ్రనాడు, మార్చి 16 :** తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసల రవి ఆధ్వర్యంలో 12 టన్నుల కాయగూరలను సోమవారం పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....శ్రీవారి అన్నప్రసాదానికి మనం అందించే ప్రతి కాయగూర ముక్క వేలాది మంది భక్తుల ఆకలి తీరుస్తుందన్నారు. లోక రక్షకుడైన ఆ శ్రీనివాసుడికి సేవ చేసుకునే ఈ సువర్ణ అవకాశాన్ని దాతలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భక్తుల ఆకలి తీర్చే ఈ మహాత్కార్యంలో భాగస్వాములు కావడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. స్వామివారికి కాయగూరలు సమర్పించే ఈ విశేష అవకాశం మన ప్రాంతానికి నెలకు ఒక్కసారి మాత్రమే లభిస్తుంది. ఈసారి సుమారు 12 టన్నుల నాణ్యమైన కాయగూరలను సేకరించి తిరుమలకు తరలించామన్నారు. రైతులు, మండీ యజమానులు, ఓకే.ఆర్. రెడ్డప్ప రెడ్డి, వి.ఆర్.ఆర్ కందస్వామి రెడ్డి, మరియు సాధారణ భక్తులు తమ శక్తి మేరకు కాయగూరలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న వారి సిబ్బంది, లయన్స్ క్లబ్ చైర్మన్ జయశంకర్, యువ నాయకులు గిరిధర గోపాల్, బిఆర్సి కుమార్, గణేష్, బాలాజీ, గోవిందస్వామి, బాబు, వేణుగోపాల్ నాయుడు, మురగయ్య, వెంకటేష్,తదితరులు హాజరయ్యారు.

## అన్ని కాలాలలో ఫార్మాసిటికల్స్‌కి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి




**రామచంద్రాపురం –ఆంధ్ర నాడు,మార్చి 16 :** భూత భవిష్యత్తు వర్తమాన కాలాలలో ఫార్మసిటికల్స్ బయో ఫార్మాసూటికల్స్ కి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఆర్ టెక్ సంస్థ సీఈఓ సురగోని రోహిత్ అన్నారు. రామచంద్రాపురం మండలం, వెంకట్రామాపురంలో ఉన్న సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో సోమవారం ఫార్మసిటికల్స్ మరియు బయో ఫార్మాసిటికల్స్ రంగాలలో కెరియర్ కి గల అవకాశాలపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురగోని రోహిత్ మాట్లాడుతూ రాబోవు కాలాలలో ఫార్మాస్యూటికల్స్ రంగా నిపుణులకు విశేషంగా ఉద్యోగ అవకాశాలు కలగతాయని తెలిపారు.నూతన ఆవిష్కరణలకు నాంది పలికితే చెప్పుకోదగ్గ అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు మాట్లాడుతూ విద్యుత్ తో పాటు సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల నందు వివిధ రకాల ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు కావలసిన శిక్షణ కూడా ఇస్తున్నట్లు చెప్పారు. పలు కంపెనీలను కళాశాలకు పిలిపించి వారితో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే కళాశాల పరిపాలన డైరెక్టర్ లక్ష్మయ్య ఉద్యోగాలకు కావలసిన నైపుణ్యతతో కూడిన పలు అంశాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం...



**కేవీబీపురం–ఆంధ్రనాడు,మార్చి 16:** మండలంలోని అంజూరు, కేవీబీపురం, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని విధాలుగా ముందస్తు ఏర్పాట్లు చేసి విద్యార్థులకు అనుకూల వాతావరణాన్ని కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ఓబయ్య ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయేందుకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.మరోవైపు మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీపతి, రవికుమార్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటుచేశారు.మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 484 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు కాగా, అందులో 478 మంది హాజరై పరీక్షలు రాశారు. 6 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారలు తెలిపారు.

## మల్లయ్యకొండ మల్లన్నకు ప్రత్యేక పూజలు

### -ఆకట్టుకున్న భక్తుల కోలాట నృత్య ప్రదర్శనలు



**తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, మార్చి 16:** తంబళ్లపల్లికి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు మల్లయ్యకొండకు వచ్చి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు భ్రమరాంబ అమ్మవారిని, మల్లికార్జున స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి దూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు.భక్తుల పేరిట అర్చనలు, అభిషేకాలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.అలాగే కొండపైన గౌరమ్మ అమ్మవారికి,కొండ మధ్యలో వెలసిన ఏనుగు మల్లమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఆలయ ఈఓ మునిరాజ ఆధ్వర్యంలో కొండపై భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కొండపై భక్తులకు అన్నదానం చేశారు.భక్తుల సౌకర్యార్థం మల్లయ్యకొండపైకి బస్సులు నడిపారు.

# తిరుపతి నుంచే రైల్వే డివిజనల్ కార్యకలా పాలు నిర్వహించాలి

### -లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ గురుమూర్తి



**తిరుపతి ప్రెస్ క్లబ్ –ఆంధ్రనాడు, మార్చి 16:** తిరుపతి రైల్వే స్టేషన్‌కు సంబంధించిన రైల్వే విభాగ కార్యకలాపాలు ప్రస్తుతం గుంతకల్ నుంచి నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల అధిక రద్దీ కారణంగా వాటిని కొంతవరకు తిరుపతి నుంచే నిర్వహించా ల్సిన అవసరం ఉందని తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించారు. తిరుపతి దేశంలోని ప్రధాన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా ఉండటంతో పాటు ప్రముఖ విద్యా, వైద్య కేంద్రంగా కూడా నిలిచిందని ఆయన తెలిపారు. తిరుమలకు ఏడాది పొడవునా లక్షలాది మంది భక్తులు వస్తుండటంతో పాటు విశ్వవిద్యాలయాలు, వైద్య విద్యాసంస్థలు ఉండటం వల్ల విద్యార్థుల ప్రయాణాలు కూడా నిరంతరం కొనసాగతాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి రైల్వే స్టేషన్ తిరుపతి––రేణిగుంట రైల్వే మార్గం ద్వారా రోజుకు సుమారు లక్షన్నర మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, దీంతో రైల్వే కార్యకలాపాలు మరియు ప్రయాణికుల నిర్వహణపై అధిక ఒత్తిడి ఏర్పడుతోందని పేర్కొన్నారు. సాధారణంగా రైల్వే పరిపాలనా విధానాల ప్రకారం ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే ప్రధాన స్టేషన్ నుంచే విభాగీయ కార్యకలాపాలు నిర్వహించడం ఆనవాయితీ అని అన్నారు.అంతేకాకుండా తిరుపతి స్టేషన్ నుంచి ప్రయాణించే ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం కూడా పలు డివిజన్ కేంద్రాల కంటే ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రులు, పార్లమెంటరీ కమిటీ సభ్యులు వంటి ప్రముఖుల తరచు పర్యటనలు కూడా తిరుపతికి జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ ప్రత్యక్షంగా రైల్వే విభాగ పర్యవేక్షణ ఉండటం అవసరమని చెప్పారు. అందువల్ల కనీసం వారానికి మూడు రోజులు అయినా రైల్వే విభాగ కార్యక౯లాపాలను తిరుపతి నుంచే నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

# అలిపిరి పోలీస్ స్టేషన్ ఏ.ఎస్.ఐ. ఆర్. పద్మావతి దేవికి ఆంధ్రప్రదేశ్ పోలీస్ సేవా పతకం



**తిరుపతి –ఆంధ్రనాడు, మార్చి 16:** ఉగాది – 2026 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ సేవా పతకాల జాబితాలో తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏ.ఎస్.ఐ ఆర్. పద్మావతి దేవి కి ఆంధ్రప్రదేశ్ పోలీస్ సేవా పతకం ప్రదానం చేయబడింది. ఆమె పేరు సేవా పతకాల జాబితాలో సీరియల్ నం.235గా చోటు పొందింది. ఈ సంద ర్భంగా ఆమెకు పోలీస్ విభాగం అధికారులు, సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే

అలిపిరి పోలీస్ స్టేషన్ నందు ఏ.ఎస్.ఐ.గా పనిచేస్తున్న ఆర్. పద్మావతిదేవి 1991 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ కాగా, పోలీస్ శాఖలో సుమారు 35 సంవత్సరాలపాటు నిరంతర సేవ అందిస్తున్నారు. ఆమె సేవాకాలమంతా ఏ విధమైన శిక్షలు లేకుండా స్వచ్ఛమైన సేవా రికార్డు కలిగి ఉండడం విశేషం. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజల పట్ల సేవాభావంతో ఆమె పనిచేస్తూ సహచరులకు ఆదర్శంగా నిలిచారు. 2022 సంవత్సరంలో ఆమె హెడ్ కానిస్టేబుల్‌గా అలిపిరి పోలీస్ స్టేషన్‌లో చేరిన తర్వాత, ముఖ్యంగా మిస్సింగ్ వ్యక్తులను గుర్తించి వారి కుటుంబాలతో మళ్లీ కలిపే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మహిళలు, బాలికలు, చిన్నారులు అదృశ్యమయ్యే కేసులు అత్యంత సున్నితమైనవిగా ఉండగా, వాటిని గుర్తించడం కోసం ఆమె ఎంతో సహనం, పట్టుదల, మానవీయ దృక్పథంతో పనిచేస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే కుటుంబ సభ్యులను సంప్రదించడం, అవసరమైన సమాచారం సేకరించడం, సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించడం, కాల్ డీటెయిల్ రికార్డులను పరిశీలించడం, ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకోవడం వంటి చర్యలను వేగంగా చేపడుతున్నారు.

**అధికారులతో మంచి సత్సంబంధాలు...**

ఆమెకు తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిశా, ఇతర రాష్ట్రాల పోలీస్ అధికారులతో మంచి సమన్వయం ఉండడం వల్ల అంతర్రాష్ట్ర స్థాయిలో కూడా మిస్సింగ్ కేసులను త్వరగా పరిష్కరించ గలుగుతున్నారు. తిరుపతికి విచ్చేసే ఇతర రాష్ట్రాల పోలీస్ బృందాలకు కూడా ఆమె సహకారం అందిస్తూ పోలీస్ విభాగాల మధ్య సమన్వయానికి మంచి ఉదాహరణగా నిలుస్తున్నారు. అదేవిధంగాఆమె సేవలో భాగంగా మిస్సింగ్ కేసుల పరిష్కారంలో గణనీయమైన ఫలితాలు సాధించారు.

- 2022 -- 76 కేసులు
-2023 -- 69 కేసులు
- 2024 -- 46 కేసులు
- 2025 -- 35 కేసులు

ఇలా ఇప్పటి వరకు మొత్తం 226 మంది మిస్సింగ్ వ్యక్తులను గుర్తించి వారి కుటుంబాలతో కలిపిన ఘనత ఆమెకు దక్కింది. ఈ విజయాలు ఆమె నిబద్ధత, కృషి, అంతా ఇంత కాదు సమర్థతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అలాగే ఆమె చేసిన అసాధారణ సేవలను గుర్తించిన తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుబ్బారాయుడు , ఆమె పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించి, పోలీస్ సేవా పతకం కోసం ఆమెను సిఫార్సు చేసి నామినేట్ చేయడం జరిగింది.ఏ.ఎస్.ఐ. పద్మావతి దేవి సేవలు సమాజంలో పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాయి. ఆమెకు ఇప్పటివరకు 6 గుడ్ సర్వీస్ ఎంట్రీలు (జి ఎస్ ఈ)కూడా లభించాయి.దీర్ఘకాల సేవ, స్వచ్ఛమైన సేవా రికార్డు, మిస్సింగ్ కేసుల పరిష్కారంలో చూపిన అసాధారణ కృషిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెను పోలీస్ సేవా పతకంతో సత్కరించడం గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా తిరుపతి పోలీస్ అధికారులు, సిబ్బంది ఏ.ఎస్.ఐ పద్మ దేవిని ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ సేవ పథకం రావడం పట్ల పలువురు అభినందించారు. మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు కోరారు.

# చేసిన అవినీతి బయటపడుతుందని ధర్నాలకు దిగుతున్న వైసీపీ

### -టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం




**తిరుపతి ప్రెస్ క్లబ్ –ఆంధ్రనాడు, మార్చి 16:** తిరుపతిలో తెల్లవారుజాము నుండి పేటీఎం బ్యాచ్ దైవ దర్శనానికి వచ్చిన టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు పైన దాడులకు దిగడం,రౌడీ మూకలతో రాస్తారోకోలు, ధర్నాలకు భయపడే దానికి అక్కడ ఉంటది బిఆర్ నాయుడు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు.బిఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాజీనామా చేయాలి, రాజీనామా చేయాలి అని పదేపదే చెబుతున్నారంటే మీరు ఏ మేరకు అవినీతి చేశారో తిరుమలలో ప్రజలకు అర్థమవుతుందని ఉన్నారు. మీరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా దాడులకు పాల్పడ్డ మీ అవినీతి చిట్టాను బయటపెట్టి తండ్రి కొడుకులను జైలుకు పంపిస్తారని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో రౌడీలు లేరని,తెలుగుదేశం పార్టీలో గనక రౌడీలే ఉంటే మీరు ఇల్లు కాదు కదా బెడ్ రూమ్ వదిలి ఇంటి బయటకు కూడా రాలేని పరిస్థితి ఉంటదని చెప్పారు.మీ పాలనలో అన్ని అవినీతే, పరకామణి, నెయ్యి కల్తీ,లడ్డు కల్తీ తప్పులు మీరు చేసి తప్పించుకోవాలని చూస్తే బి.ఆర్ నాయుడు వదిలే మనిషి కాదని అన్నారు. ఆయన చేసిన మంచి పనులలో పోలిస్తే మీ పాలనలో ఒక్క పని అయినా సక్రమంగా చేశారా అని ప్రశ్నించారు.ఇంకొకసారి టిడిపి వాళ్లపై తప్పుడు ప్రచారం చేస్తే మేము సై అంటామన్నారు.ఇంకొకసారి బిఆర్ నాయుడు పై ముట్టడి కార్యక్రమం చేస్తే తీవ్ర పరిణామం ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. తెలుగుదేశం వాళ్ళు రౌడీలే అయితే మీరు ఇల్లు వదిలి వచ్చే ప్రసక్తే లేదని కొన్నారు.

ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధుబాబు,తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రజనీకాంత్ నాయుడు, మహిళా నాయకురాలు పుష్పావతి,యశోద,మూడవ వార్డు నంద,సూర్యకుమారి, కె ఎస్ లత,4వ వార్డు అధ్యక్షులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733